క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఈపూరు: మండలంలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఈ నెల 10వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎల్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఊడిజర్ల, ముప్పాళ్ల, కొచ్చర్ల, ఈపూరు సబ్ స్టేషన్‌ల పరిధిలోని 11కేవీ, 33 కేవీ, ఎల్‌టీ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

డిప్యూటీ కలెక్టర్ వసంతరావు



శావల్యాపురం: రీసర్వే పనులు పురోగతి వేగవంతం చేయాలని పులిచింతల డిప్యూటీ ప్రత్యేక కలెక్టర్ జి.వసంతరావు అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రీసర్వే పనుల పురోగతిపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. మండలంలోని వేల్పూరు, శానంపూడి, పిచికలపాలెం, పోట్లూరు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తయి రికార్డు పనులు జరుగుతున్నాయన్నారు. రికార్డు పనులు పూర్తి అయిన గ్రామాల్లో రైతులకు నేరుగా ఫాం 9 (2) నోటీసులు ఆయా గ్రామాల్లోని వీఆర్ఏలు అందజేయాలన్నారు. నోటీసులు తీసుకున్న రైతులు తమ భూములపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నపక్షంలో సమగ్ర ఆధారాలతో రెవెన్యూ అధికారులకు అందజేస్తే సత్వరమే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల): మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ డి.వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండ, గురజాల, నరసరావుపేట పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన బీసీ విద్యార్థులు జూన్ 13వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, 15వ తేదీన ఆయా పాఠశాలల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 9951691407, 9603540880, 9441324035 నంబర్లకు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

నేడు పిచికలపాలెంలో దేవాలయాల ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామంలో నూతన దేవాలయాలు ప్రతిష్ట శనివారం జరుగనుంది. విజయ గణపతి, మహాశీతలి, బొడ్రాయి, గమిడిశీతలి, పోలేరమ్మ తల్లి, పోతురాజు, వీరబ్రహ్మేంద్ర స్వాముల, నీలంపాటి అమ్మ దేవాలయాల ప్రతిష్ఠా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. భారీ అన్నదానం కూడా ఏర్పాటు చేశామని నిర్వాహకులు వెల్లడించారు.

11న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులోని మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశాలకు ఈ నెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వల్లెపు శ్రీను శుక్రవారం తెలిపారు. 6వ తరగతిలో చేరేందుకు ముందుగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు విధిగా హాజరుకావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో బియ్యం వ్యాపారి దుర్మరణం

గాయాలపాలై చికిత్స పొందుతున్న భార్య



నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో బియ్యం వ్యాపారి దుర్మరణం పాలైన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో బియ్యం వ్యాపా రం చేసే గిరి గురునాధం (63) గురువారం పసుమర్రు గ్రామంలో ఓ వేడుకకు హాజరయ్యేందుకు భార్య శ్రీలక్ష్మితో తన ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. నరసరావుపేట- చిలకలూరిపేట రహదారిలో కనపర్రు సమీపంలోని పుష్పావతి కోల్డ్ స్టోరేజీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన ఇరువురినీ నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురునాధం మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. శుక్రవారం మృతదేహాన్ని నరసరావుపేట వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

మాట ఇస్తే మడమ తిప్పని వ్యక్తి సీఎం జగన్

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన పారామెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

నరసరావుపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇస్తే మడమ తిప్పడనే దానికి ప్రత్యక్ష నిదర్శనమే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించటమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంపై హర్షాతిరేఖాలు వ్యక్తంచేస్తూ వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పారా మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు శుక్రవారం గుంటూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఎదుట సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ తండ్రి వైఎస్సార్ బాటలో నడిచి సుమారు పదివేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయటం సామాన్యమైన విషయం కాదన్నారు. గతంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు చేయని ధైర్యం చేసి మినిమమ్ టైమ్‌స్కేలుపై రెగ్యులర్ చేశారన్నారు. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన 72 హామీలలో 63 హామీలను నెరవేర్చారన్నారు. దీనిపై ఉద్యోగులు అందరూ చాలా సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి దేశంలో సీఎం జగన్ ఒక్కరే అన్నారు. ఉద్యోగస్తుల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని, స్కూలు ఎడ్యుకేషన్‌లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 1800 పోస్టుల భర్తీ చేస్తున్నారన్నారు. గ్రూప్-1, 2లు, మెడికల్ కళాశాలలు, హోంగార్డులు 6,800 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. త్వరలో డీఎస్సీ కూడా ప్రకటించబోతున్నారన్నారు. 1998లో డీఎస్సీ పాసైన వారికి ఉద్యోగాలు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగుల కళ్లలో ఆనందం చూస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చేసుకునేందుకు ఉద్యోగులు ఉవ్విళ్లూరుతున్నారన్నారు. పారా మెడికల్ ఉద్యోగులు మాట్లాడుతూ తాము 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగాలు చేస్తుండగా గత ప్రభుత్వం తమను రెగ్యులర్ చేస్తామని చెప్పి కమిటీలు వేసి కాలయాపన చేసిందన్నారు. అప్పుడు మీ ప్రభుత్వం చేయకపోతే తాము అధికారంలోకి రాగానే చేస్తామని ప్రతిపక్షనేతగా అసెంబ్లీ, పాదయాత్రలో చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఇప్పుడు దేవుడు రూపంలో తమను రెగ్యులర్ చేశారన్నారు. జీవితాంతం ఆయనకు తాము రుణపడి ఉంటామన్నారు. ఈసందర్భంగా వారందరూ చిత్రపటానికి పాలాభిషేకం చేసి జై జగన్ అందరూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పారా మెడికల్ ఉద్యోగులతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల శివారెడ్డి, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, మైనార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్‌ఖాదర్‌భాష, మాజీ సర్పంచు వంపుగుడి జాన్ పాల్గొన్నారు.

ఐక్యమత్యంతోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, గోల్కొండ హోటల్స్ అధినేత నడికట్టు రామిరెడ్డి



రంగారెడ్డిపాలెంలో కల్యాణమండపం శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: ఐక్యమత్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని రంగారెడ్డిపాలెంలో కల్యాణమండప నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డితో పాటు గోల్కొండ హోటల్స్ అధినేత నడికట్టు రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డిపాలెం గ్రామానికి ప్రత్యేకత ఉందని, గ్రామస్తులంతా ఒకే మాటపై నిలబడి ముందుకు సాగుతుంటారని తెలిపారు. గ్రామస్తులందరూ ఐక్యమత్యంగా ఉండటం వలనే గ్రామం అభివృద్ధి బాట పడుతుందన్నారు. గ్రామానికి అవసరమైన కాజ్‌వేను రైతుల సహకారంతో నిర్మించామని తెలిపారు. అలాగే కల్యాణ మండపాన్ని కూడా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల నిధులతో పాటు మండల పరిషత్ నిధులు, నడికట్టు రామిరెడ్డి లాంటి పెద్దల సహకారంతో త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. గోల్కొండ హోటల్స్ అధినేత రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చేపట్టిన ప్రతి కార్యక్రమం విజయవంతంగా పూర్తిచేస్తారని తెలిపారు. కల్యాణ మండపాన్ని కూడా అలాగే పూర్తి చేస్తారన్న నమ్మకం తనకు ఉందన్నారు. మౌళిక వసతుల కల్పనకు గ్రామస్తులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ కుందా చిన్నా, ఉపసర్పంచ్ తేళ్లూరి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ షేక్ నూరల్ అక్తాబ్, వంపుగూడి జాన్, స్థలదాత దొండెటి అచ్చిరెడ్డి, మూరే రవీంద్రారెడ్డి, యేరువ హనిమిరెడ్డి, గాయం రామిరెడ్డి, బీమిరెడ్డి పున్నారెడ్డి, యేరువ రమణారెడ్డి, యేరువ చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో గ్రామోదయం



వినుకొండ వార్డులోని పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీలో గ్రామోదయం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ మోహన్‌చంద్, ఎంఈవో జప్రుల్లా, వైద్యులు ఇబ్రహీంతో పాటు స్థానిక అధికారులు గ్రామంలో తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు చెట్లు పడిపోవడం వల్ల తీగలు తెగిపోయి విద్యుత్ సరఫరా లేదని, రోడ్లకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగించాలని అధికారులకు గ్రామస్తులు తెలిపారు. వెంటనే చెట్లను తొలగించే ప్రక్రియ చేపట్టారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్‌సెంటర్లను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

వినుకొండలో నగరోదయం

వినుకొండ(నూజెండ్ల): ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు పట్టణంలోని 14వ వార్డులో శుక్రవారం నగరోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలను, అంగన్‌వాడీ స్కూల్స్, శానిటేషన్, కరెంటు, లోటబ్రిజీ సమస్యలు, డ్రెయినేజీ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. రక్తహీనత గల మహిళలను, గర్భిణులను గుర్తించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ షకీలా, జయరాజు, సానాల పుల్లయ్య, ఏఈఈ చంద్రశేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ముండ్రువారిపాలెంలో గ్రామోదయం

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం మండల స్థాయి అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సారధ్యంలో గ్రామంలో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలతీరును స్వయంగా లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించి కూలీలకు తగు సూచనలు చేశారు. గ్రామంలో అంగన్‌వాడీ సెంటరు సందర్శించి చిన్నారులను గర్భిణులను పలకరించి రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి తగు నియంత్రణ తీసుకోవాల్సిన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపసాని విజయలక్ష్మి, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ముండ్రు మనోహర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బొల్లాపల్లి మండలం కనుమలచెరువు పంచాయతీ పరిధిలోని మూడు తూముల తండాకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వడితే సోమ్లా నాయక్ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా సోమ్లానాయక్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సోషల్‌మీడియా కన్వీనర్ అవినాష్ రెడ్డి, మండల కన్వీనర్ మట్టి రాజయ్య, కనుమలచెరువు సర్పంచ్ భూక్యా ప్రశాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

9న వివిధ అంశాలపై పోటీలు

ఈపూరు: మండల కేంద్రంలోని ఈపూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు 35 రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారి గంటా శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు రాయడం, చిత్రలేఖనం,స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు గ్రామర్, జనరల్ నాలెడ్జ్, పిరమిడ్ ధ్యానం-యోగా, చెస్, క్యారమ్స్‌లలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 9వ తేదీన విద్యార్థులకు చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్ పోటీలు, కథల పోటీలు, క్విజ్, జాతీయ గీతాలు, పేపర్ క్రాఫ్ట్ డిజైన్స్ మొదలైన అంశాలపై పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 11వ తేదీన జరిగే వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో షీల్డ్, సర్టిఫికెట్స్ అందజేయడం జరుగుతుందన్నారు.

ఈపూరు ఎంపీడీవోగా రంగనాయకులు

ఈపూరు : మండల అభివృద్ధి అధికారిగా ఏవీ రంగనాయకులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా బేస్తవారిపేట ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీపై ఈపూరు వచ్చారు. మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, స్థానిక ప్రజాప్రతినిధులను కలుపుకొని పోయి అన్ని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చేస్తామన్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన ఉషాకిరణ్ తన యధాస్థానమైన బొల్లాపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించనున్నారు.

విజిలెన్స్ దాడులు

చిలకలూరిపేట: మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సీహెచ్ రమేష్, కేవీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో 29 బృందాలుగా అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అదనపు లోడ్ వాడుతున్న 88 సర్వీసులను గుర్తించి వారికి రూ. 3,89,400 అపరాధ రుసుము విధించారు.

యార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తా



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి వెంకటేశ్వర్లు

ఈపూరు: మార్కెట్‌యార్డును అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు తనవంతు శాయశక్తులా ప్రయత్నిస్తానని ఈపూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో యార్డు కార్యదర్శి మురళి అధ్యక్షతన శుక్రవారం కమిటీ తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీజనల్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, అలాగే యార్డు ద్వారా యార్డు పరిధిలోని మండలాల్లోని రైతులకు ఉచితంగా పశువైద్యం అందిస్తామన్నారు. మినీ కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపడతామని తెలిపారు. అలాగే రైతు సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే రైతులకు సాధ్యమైనంతవరకు అన్ని పథకాలు యార్డు ద్వారా అందేలా చూస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో యార్డు వైస్ చైర్మన్ బెలూం శ్రీరామ్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూయజమాని అనుమతితో పంట సాగుదారు పత్రాలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దారు జాన్‌సైదులు

శావల్యాపురం: భూ యజమాని అంగీకారంతో కౌలు రైతులకు పంటసాగుదారు హక్కు పత్రం మంజూరు చేస్తామని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో కౌలు రైతులకు పంటసాగుదారు ధ్రువీకరణ పత్రాల మంజూరుపై రైతులతో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా గ్రామసభ ను నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు సన్నచిన్నకారు రైతులందరు రైతుభరోసా కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో విచారణ చేసిన అనంతరం పంట సాగుదారు ధృవీకరణ పత్రాలు మంజూరు చేస్తామన్నారు. ఈపత్రాలు కల్గిన రైతులకు రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం పరంగా రాయితీపై విత్తనాలు, బ్యాంకు రుణాలు మంజూరు అవుతాయన్నారు. భూయజమానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా 12 నెలల వరకు ఈపత్రం గడవన్నారు. అన్నీ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఈఖరీఫ్ సీజను 2వేల మంది కౌలు రైతులకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయటానికి లక్ష్యాంగా ఎంచుకున్నట్లు చెప్పారు. ఈసదస్సులో మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఆర్ఐ చంద్రబాబు, ఏఈవో పురేటి అశోక, వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డుల వల్ల లాభాలు



కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రామారావు

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు గ్రామ సచివాలయంలో కౌలుదారుల అవగాహన సదస్సులో భాగంగా కౌలు రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయ అధికారి ఆర్. రామారావు పాల్గొని మాట్లాడుతూ కౌలుకు భూమిని సాగు చేసే ప్రతి ఒక్క రైతు కూడా కౌలు రైతు కార్డులు పొందాలని, కౌలురైతు కార్డుల ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతాయన్నారు. భూయజమానులు కౌలుదారులకు కౌలు కార్డు తీసుకోవడానికి సహకరించాలని, తద్వారా కౌలు రైతుకు పంటల బీమా, పంట రుణం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, ఏదైనా విపత్తులో పంట నష్టపరిహారం పొందవచ్చన్నారు. యజమానులకు భూహక్కుకి ఎటువంటి నష్టం వాటిల్లదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సొంత పొలం లేని వారు కౌలు కార్డు ద్వారా రైతు భరోసా సాయం కూడా పొందవచ్చన్నారు. ఖరీఫ్ 2023 సంవత్సరానికి ముందస్తుగా రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలైనా జీలుగ, జనుము 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఈ పచ్చిరొట్ట పైర్లను వారి పొలాల్లో సాగు చేసి వాటిని కలియదున్నడం ద్వారా భూసారం పెంచుకోవచ్చునని, అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. పీఎం-కిసాన్ ఈకేవైసీ అందరూ చేయించుకోవాలని తెలియజేశారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు లైసెన్స్ ఉన్న డీలర్ దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదును తీసుకొని జాగ్రత్తగా పంట కాలం పూర్తయ్యే వరకు దాచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.శేషుబాబు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కిసాన్ లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి



సాతులూరులో ఈకేవైసీ పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

నాదెండ్ల: పీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ మురళి చెప్పారు. సాతులూరు గ్రామంలోని ఆర్‌బీకే కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ముఖ ఆధారిత ఈకేవైసీ విధానం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పీఎం కిసాన్ నిధులు తమ ఖాతాలో రావాలంటే తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలన్నారు. కొందరి వేలిముద్రలు పడనందున ముఖ ఆధారిత ఈకేవైసీ చేయించాలన్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో 84 శాతం పూర్తయిందని, 33900 మంది రైతులు ఇంకా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. రైతులు 14వ విడత పీఎం కిసాన్ నిధులు తమ ఖాతాల్లో జమ కావాలంటే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఆయనతో పాటూ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఉప సంచాలకులు (ఫార్మర్ వెల్ఫేర్ సెక్షన్) ఎం.పద్మావతి, టెక్నికల్ ఏవో జి సరిత, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.రామారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

అఖండ జ్యోతి ప్రజ్వలన ఆహ్వాన పత్రిక విడుదల

వినుకొండ టౌన్: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న వినుకొండ కొండపై జరగనున్న అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన ప్రతులను హిమాలయ గురూజీ శుక్రవారం విడుదల చేశారు. వినుకొండ రూరల్ విఠంరాజుపల్లి గ్రామ శివారులోని సాయి బృందావనంలో వినుకొండ శాంతి ఆశ్రమం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినం నాడు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమౌతాయన్నారు. సాయంత్రం 6.30 నిముషాలకు అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాని నిర్వహిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు తాతా రమేష్, పెండేల మోహన్‌రావు, రామడుగు కోటేశ్వరరావు, సత్యం, సుధాకర్, పెండేల కాశి, ఎం. నాగముని రెడ్డి, పెండేల సురేష్, వి. బ్రహ్మం, అశోక్‌రెడ్డి, దామోదర్‌రావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ముందంజ

చిలకలూరిపేటటౌన్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఉపాధ్యాయ ఉద్యమాలకు మాతృక అని రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం 77వ ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఎస్టీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన సంఘం ఎస్టీయూ అని చెప్పారు. ఉద్యమ ప్రస్థానం 76 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని 77వ వసంతంలోకి అడుగుపెడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉపాధ్యాయలు పొందుతున్న అనేక సౌకర్యాల కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, నాయకులు ఎం.ప్రసన్నకుమార్, షేక్ మస్తాన్‌వలి, షేక్ జమీర్‌బాష, ఎస్ కాలేషా, వెల్లటూరి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

సచివాలయాల ఉద్యోగులతో కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి



మాట్లాడుతున్న కమిషనర్ సభ్యురాలు పద్మావతి, పీడీ అరుణ

నరసరావుపేట: రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది యావత్తు భాగస్వాములై బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాలలో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి కోరారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని 32 33 34 వార్డుల సచివాలయాలకు చెందిన సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల వడంబడిక, బాలల న్యాయ సంరక్షణ చట్టం-2017 ప్రకారం పిల్లలందరూ విద్యాలయాలలో విద్యను అభ్యసించాలని, బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఆరోగ్యకార్యకర్తలు తరచూ పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు సందర్శించి బాలలకు వైద్య పరీక్షలు చేసి రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. రెవెన్యూ కార్యదర్శులు అందరూ విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ధృవ పత్రాల జారీలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ పి.అరుణ, చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కేంద్రీయ విద్యాలయలో సదస్సులు

నాదెండ్ల: గణపవరం సీఆర్ పాలిటెక్నిక్‌కళాశాల ఆవరణలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకూ సమ్మర్ క్యాంప్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీపై సదస్సులు జరుగుతున్నట్లు ప్రిన్సిపల్ ఎస్ విజయకుమార్ చెప్పారు. జి-20, ఎన్ఈపీ, ఎఫ్ఎల్ఎన్ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్లు, డిజిటల్ ఎడ్యుకేషన్, కథల తయారీ, రంగోలి, సైకిల్ ర్యాలీ, వాల్ పెయింటింగ్ ,డ్రామా వంటి పలు విభాగాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రియ విద్యాలయాలతో పాటూ సీబీఎస్ఈ/ రాష్ట్ర సిలబస్ బోధించే విద్యాలయాల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు చివరిరోజు బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు.

రేపు 6వ తరగతికి ప్రవేశ పరీక్ష

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యాసంవత్సరం 6వ తరగతి ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవినాయక్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు ఆదివారం ఉదయం 9 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఈ పరీక్షా వి.రెడ్డిపాలెం లోని మోడల్ స్కూల్‌లోనే నిర్వహిస్తామన్నారు.

సర్టిఫికేట్లు అందజేత

నరసరావుపేట: ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తిచేసుకున్న 12వ బ్యాచ్‌కు చెందిన అభ్యర్థులకు సర్టిఫికేట్లను డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి శుక్రవారం అందజేశారు. 13వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం కాబోతుందని, శిక్షణ పొందే లైట్‌వెయిట్ డ్రైవింగ్ అభ్యర్థులు 73828 96038, 99592 25428, 73828 96158 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైద్యశాల ఆకస్మిక తనిఖీ

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. శోభారాణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించారు.అనంతరం గోగులపాడు గ్రామంలో ఇంటింటా ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంపై కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి. శ్రీనివాసరావు, డాక్టర్‌లు ఎస్. రేవతిభాయి, డి. మురళీధర్, జగన్ నరసింహారెడ్డి, పీహెచ్ఎన్ సుజాత కుమారి, శ్రీధర్‌రెడ్డి, శాంతకుమారి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రైలు నుండి పడి వ్యక్తి మృతి

వినుకొండ టౌన్: రైలు నుండి వ్యక్తి జారిపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. స్థానిక రైల్వే అధికారులు తెలిపిన సమాచారం మేరకు వాస్కోడిగామ నుండి హౌరా వెళ్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్ రైలు నుండి తెల్లవారుజామున దాదాపు 2.30 నిముషాల సమయంలో ప్రమాదవశాత్తు గుర్తు తెలియని వ్యక్తి జారిపడి, మృతి చెందడం జరిగిందన్నారు.